ఆకేరువాగు చెక్‌డ్యామ్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం

- గోదావరి ఇసుక వాడాలని రూ.80లక్షలు కేటాయింపు
- నిబంధనలకు విరుద్ధంగా లోకల్ ఇసుక వినియోగం

కాచికల్ ఆకేరువాగులో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణం

డంపు చేసిన ఆకేరువాగు ఇసుక

నెల్లికుదురు, మార్చి 19: మండలంలోని కాచికల్ గ్రామ శివారు ఆకేరువాగులో చెక్‌డ్యామ్ నిర్మాణం నాణ్యత లోపంతో చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.4.50 కోట్ల వ్యయంతో చేపట్టిన చెక్‌డ్యామ్ పనుల్లో నిబంధనల ప్రకారం గోదావరి ఇసుక ఉపయోగించాలి. ఇందుకు సుమారు రూ.80లక్షలు కేటాయించారు. కానీ అందుకు విరుద్ధంగా ఆకేరువాగు ఇసుకనే తవ్వి గుట్టలుగా పోసి ఉపయోగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. చెక్‌డ్యామ్ నిర్మాణ ముసుగులో ఇసుకను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు గ్రామస్తులు ఇటీవల తహసీల్దార్ కే రాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చెక్ డ్యామ్ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని ఆదేశించారు. దీంతో పనులు నిలిపివేశారు.

నిర్మాణ పనులతో నాకు పంట నష్టం

ఆకేరువాగు శివారులో 4.20 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్న. ఆడ మగ వరి వేసిన. పొలం పక్కనే చెక్‌డ్యామ్ నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, కంకర, ఇతర మెటీరియల్ వేశారు. 1.20 ఎకరాల పంట పాడైపోయింది. ఎకరం పొలం మొత్తం బీడువారింది. నిర్మాణంలోనూ నాణ్యత పాటించడంలేదు. గోదావరి ఇసుక వినియోగించకుండా ఆకేరువాగు ఇసుకనే వినియోగిస్తున్నారు.

– సంకినేని కిరణ్, రైతు

పక్షుల దాహం తీర్చేందుకు..

ఎండలు దంచికొడుతున్నాయి.. మనకు తాగు నీరు ఎలాగోలా లభిస్తుంది. పక్షుల పరిస్థితేంటి? వాటి దాహార్తి తీర్చాలని ఓ బాలుడి ఆలోచన వచ్చింది. ఐదో తరగతి చదువుతున్న ఎస్‌కే హల్తాఫ్ ప్లాస్టిక్ బాటిళ్లను కోసం వాటిలో నీళ్లు పోసి, వైర్లతో వారు కిరాయికి నివసిస్తున్న ఇంటి పరిసరాల్లోని చెట్ల కొమ్మలకు కట్టాడు. ఇలా ఐదు నుంచి పది వరకు చేశాడు. పక్షుల కోసం నీటిని ఏర్పాటు చేసిన హల్తాఫ్‌ను చూసిన పలువురు అభినందించారు.

– నర్సింహులపేట, మార్చి 19

పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 163 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఈ పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా ఉండొద్దని సూచించారు. ఎలాంటి సభలు, సమావేశాలు, డీజేలు, ఊరేగింపులు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

వేసవి ఎండల దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : వేసవి ఎండల దృష్ట్యా జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండ, వడదెబ్బ తగలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల పనివేళల్లో మార్పులు చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాస్ నోటీసు

పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ బుచ్చయ్య

తొర్రూరు మార్చి 19: మండలంలోని గుడిబండతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.వినిల్ విధులకు ఆలస్యంగా హాజరు కావడంతో ఎంఈఓ బుచ్చయ్య షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఎంఈఓ బుధవారం ఉదయం 7.50గంటలకు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేయగా, ఉపాధ్యాయుడు వినీల్ 8.28 గంటలకు హాజరయ్యారు. దీంతో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీస్ జారీ చేశారు. వివరణ ఇవ్వకుంటే తదుపరి చర్యల కోసం డీఈఓకు నివేదించనున్నట్లు తెలిపారు. అనారోగ్యం, రవాణా సమస్యతో ఆలస్యమైనట్లు సదరు ఉపాధ్యాయుడు తన వివరణలో పేర్కొన్నారు.

ఏజీపీలకు ఘనంగా సన్మానం

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : మానుకోట సీనియర్ సివిల్ కోర్టులో ఏపీజీగా నియమితులైన ఆరెల్లి శ్రీనివాస్, తొర్రూరు సివిల్ కోర్టు ఏజీపీగా సేవలందిస్తున్న బండపల్లి వెంకన్న, తెలంగాణ రాష్ట్ర తరపున పాల్గొని జాతీయ కాంస్య పతకం సాధించిన కొంపల్లి అంజయ్యను సన్మానించారు. గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నలంద కళాశాలలో ఘనంగా సన్మానించారు. గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీను, ముక్తేశ్వర్, గోవర్ధన్, ఏకాంతం, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

గంగారం మార్చి 19: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా హబ్ ఎంప్లాయ్‌మెంట్ ఉమెన్ మహేశ్వరీ అన్నారు. గిరిజన బాలికల పాఠశాలలో బుధవారం భేటీ బచావో – భేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలను రక్షించుకుంటూ వారి భవిష్యత్ కోసం చదివించాలన్నారు. సౌజన్య, అరుణ, పాఠశాల హెచ్‌ఎం కాంతారావు, ఎస్‌ఆర్‌పీ సుధాకర్, నాగయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : మండలంలోని జమాండ్లపల్లి శివారులో ఉన్న మున్నేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రీధర్ తన డ్రైవర్ అయిన రాజేశ్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

కొత్తగూడ, మార్చి 19: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి అన్నారు. మండల కేంద్రంలోని జీవిఎన్‌గర్ (పీవైఎల్) (పీడీఎస్‌యూ) రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ వంటి వారు అనేక మంది విప్లవవీరులు ఉరికంభానికి ఎక్కారని తెలిపారు. పూనెం ప్రభాకరన్న, ల్యాదల్ల రాజు, కంగాల పాపన్న, రాజబోయిన రాజు, అశోక్, రవి, కొమ్మన్న, రామ్మూర్తి, సారన్న, జితేందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మెనూ పాటించాలి

కేసముద్రం, మార్చి 19: అంగన్‌వాడీల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు కేటాయించిన మెనూ తప్పకుండా పాటించాలని సీడీపీవో శిరీష అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టీచర్లు సమయపాలన పాటించాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాని సూచించారు. ఏడు నెల నుంచి మూడేళ్ల పిల్లలకు ఫేస్ క్యాప్చర్ చేయాలని, పిల్లల బరువు, ఎత్తు సరిగా నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు దుర్గ, జ్యోతి, విజయ ఉన్నారు.

రెండు సెంటర్లు.. 358 మంది విద్యార్థులు

నెల్లికుదురులో పదో తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇన్విజిలేటర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈవో రాందాస్

నెల్లికుదురు, మార్చి 19: ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలు మండలంలోని ప్రభుత్వ ఉన్నత, కేజీబీవీ, మోడల్, ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు.. మొత్తం తొమ్మిది పాఠశాలలకు చెందిన 358 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్‌లో సీఎస్, డీవో, 10 మంది ఇన్విజిలేటర్లు మొత్తం రెండు సెంటర్లలో కలిపి 24 మంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కాగా, ఎంఈఓ ఏ.రాందాస్ ఇన్విజిలేటర్లకు బుధవారం స్థానిక ఎమ్మార్సీలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను అందజేశారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం బీసీ బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టడం ఎంత ముఖ్యమో దాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించేలా ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు బీసీలకు అందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్, శ్రీధర్, వీరన్న, వీరభద్రం, వేణు, యాదగిరి పాల్గొన్నారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి

వెంకన్న (ఫైల్)

దంతాలపల్లి, మార్చి 19: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామ పంచాయతీ కారోబార్ కొంపెల్లి వెంకన్న అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న గ్రామ కారోబార్‌గా 35ఏండ్లుగా పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. మృతదేహంపై మండల పంచాయతీ అధికారి అఫ్సర్‌పాషా పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. జీపీ నుంచి తక్షణసాయంగా రూ.10వేల ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

CHANGE OF NAME
I, BOKKA SARITHA (New name) resident of H.No: 13-220, Ambedkar Nagar, Hasanparthy, Hanumakonda Dist-506371, Telangana,. Changed my name from JANNU SHALIMA (Old name) W/o JANNU SURENDER to BOKKA SARITHA for all purposes.

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వ్యవసాయ, సంక్షేమ రంగాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ నేత మంగళపెల్లి శ్రీనివాస్

తొర్రూరు మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై బీఆర్ఎస్ నేత, మండల మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు, మహిళలు, నిరుద్యోగ యువత కోసం తగిన నిధులు కేటాయించలేదన్నారు. వ్యవసాయ, సంక్షేమ రంగాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయకుండానే, కొత్త బడ్జెట్‌లో ఆశాజనకమైన కేటాయింపులు లేక దురదృష్టకరమని తెలిపారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, వృత్తి నైపుణ్య అభివృద్ధి కోసం సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కులవృత్తులపై ఆధారపడిన దళితులు, గొల్ల కురుమలు, ముదిరాజులు, గంగపుత్రులు, గౌడ కార్మికులు, చేనేత వృత్తిదారులు, బీడీ కార్మికులకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, చిన్న, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం తగిన నిధులు కేటాయించలేదన్నారు..

కాలం చెల్లిన మజా బాటిల్ విక్రయం

దంతాలపల్లి, మార్చి 19: మండలంలోని పలు గ్రామాల్లో కాలం చెల్లిన కూల్‌డ్రింక్‌లు విక్రయిస్తున్నారు. మండలంలోని బొడ్లాడలో బుధవారం ఓ కిరాణా షాపులో లీటర్ మజా బాటిల్ కొనుగోలు చేయగా దాని కాలం చెల్లిపోయింది. ఫిబ్రవరి నెలలో ఎక్స్‌పైరీ అయి ఉండటం చూసి అవాక్కయ్యారు. తరుచు ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

దళిత సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేయాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 19: బడ్జెట్‌లో కేటాయించిన నిధులను దళితుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని పెరుమాండ్ల జగన్నాథ భవనంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో గౌరవంగా బతకాలంటే చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, లచ్చయ్య, ఎల్లయ్య, మహేందర్, వెంకట్రాములు, అనిల్, ప్రశాంత్, వెంకన్న పాల్గొన్నారు.

మరిపెడలో సంత వేలం

మరిపెడ, మార్చి 19: మండల కేంద్రంలో సంత వేలం బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ కే నరేశ్‌రెడ్డి నిర్వహించారు. ఏప్రిల్ 2025 నుంచి 2026 సంవత్సరం వరకు నిర్వహించిన వేలంలో రూ.26లక్షలకు బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ కిషన్‌నాయక్ పాడి దక్కించుకున్నట్లు కమిషనర్ ప్రకటించారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నర్సింహులపేట, మార్చి 19: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పురోగతి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది బస చేసే ప్రాంతాలు, స్టేషన్ గదులను పరిశీలించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్లు విద్యావంతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఫేక్ లింక్స్, మోసపూరిత యాప్స్ ద్వారా యువత నష్టపోతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, సోషల్ మీడియాలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ గణేశ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్‌క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మాలోత్ సురేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రెడ్యా పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ/ డోర్నకల్, మార్చి 19: మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బుధవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఫైజ్, బాషి తల్లి మోరియం బీ బుధవారం మృతిచెందగా భౌతికకాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. తండ ధర్మారంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుగులోత్ జగన్నాథంను పరామర్శించారు. గుగులోత్ వెంకన్న, లతీఫ్, మాక్సుద్, వర్ల భద్రయ్య, పానుగోత్ వెంకన్న, బాలాజీ, వస్రం, రేఖ వెంకటేశ్వర్లు, భద్రయ్య, ఆఫ్రిద్, అజ్జు, బాలకిషన్ పాల్గొన్నారు. డోర్నకల్ మండలం గొల్లచర్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎస్ సంతోష్ కుమారుడు దీక్షిత్ అన్నప్రాసన స్థానికంగా జరగ్గా మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ హాజరై ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మాజీ సర్పంచ్ చేరెడ్డి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

వేతనం రూ.18వేలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగన్న, మల్లయ్య, ఉపేంద్ర, రమాదేవి, నళిని, స్వరూప, రమ, విజయ, జయసుధ పాల్గొన్నారు.

ఎక్కువ కూలి పడాలంటే రూ.100 ఇవ్వాల్సిందే..

'ఉపాధి హామీ'లో అధికారులు, మేట్ల వసూళ్లు

పెద్దవంగర, మార్చి 19: ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనికి అధిక వేతన డబ్బులు బ్యాంకు అకౌంట్లో పడాలంటే అధికారులు, మేట్లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనికి ఎక్కువగా వేతన డబ్బులు పడాలంటే.. ప్రతి పని మస్టర్‌పై ప్రతి కూలీ నుంచి రూ.100 వసూలు చేస్తున్న ట్లు సమాచారం. దీనిపై కూలీలు ప్రశ్నిస్తే ఉపాధి హామీ అధికారులకు డబ్బులు చెల్లిస్తే చేసిన పనికి అధిక వేతన డబ్బులు వేస్తారని, లేదంటే చేసిన కూలీకి తగిన వేతన డబ్బులే పడతాయంటున్నట్లు చెబుతున్నారు. దీంతో అడిగిన డబ్బులు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఉపాధి హామీలో వసూళ్లు చేస్తున్న టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం, మార్చి 19: మండలంలోని కోరుకొండపల్లికి చెందిన గుజ్జునూరి యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులకు ఇంటర్మీడియట్ స్నేహితులు గురువారం ఆర్థికసాయం అందించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడు 2003–05లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. ఆర్థికసాయం అందించిన వారిలో పోరండ్ల లక్ష్మణ్, మహ్మద్ జావెద్, నర్సింగోజు రాజయ్య, భిక్షపతి ఉన్నారు.

యాకమ్మకు తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారం

పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ యాకమ్మ

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కవి, రచయిత డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ తిరుమల స్వరాజ్యలక్ష్మికి పురస్కారం లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని ధర్మనిధి సాహిత్య ప్రదానోత్సవాల్లో భాగంగా సాహితీమూర్తులకు అందించే తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, తెలంగాణ ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. పలువురు డాక్టర్ యాకమ్మకు అభినందనలు తెలిపారు.

బడ్జెట్‌లో విద్యాశాఖకు తగ్గిన కేటాయింపులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు గత ఏడాది కంటే 0.20 శాతం కేటాయింపులు తగ్గాయని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ పరిధిలోని 26,067 ప్రభుత్వ పాఠశాలలను గాలికి వదిలేసి రెసిడెన్షియల్, యంగ్ ఇండియా స్కూళ్ల గురించి మంత్రులు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకుల, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ బడ్జెట్ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని తెలిపారు. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన, మెరుగైన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినట్లుగా విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

తొర్రూరు, మార్చి 19: ఈనెల 23న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ ఉమ్మడి డివిజన్ మాజీ అధ్యక్షుడు మేకల కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విశ్రాంతి భవనంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో జరిగిన ఉద్యమాలను గుర్తుచేసుకుంటూ, సమ్మేళనం ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోసం ఆర్థికసాయం

మహబూబాబాద్ రూరల్, మార్చి 19: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అన్ని కులాలవారికి స్వయం ఉపాధి కల్పన కోసం రూ.4లక్షల వరకు ఆర్థికసాయం అందించనున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. 60శాతం నుంచి 80శాతం వరకు సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. రేషన్‌కార్డు ఉన్న వారు ఆధార్‌కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాన్‌కార్డ్‌లతో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం'

మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ కార్యదర్శి యశోదభాస్కర్

తొర్రూరు, మార్చి 19: ఎస్సీ వర్గీకరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ కార్యదర్శి యశోద భాస్కర్ అన్నారు. బుధవారం మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల రిజర్వేషన్లు పెంచేందుకు కృషి చేయాలే కానీ, వర్గీకరణతో విభజించడం అప్రజాస్వామికమన్నారు. ఏకసభ్య కమిషన్ ద్వారా దళితుల సంఖ్యను తక్కువ చూపి, రిజర్వేషన్ తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల మహేశ్, సంఘ ప్రచార కార్యదర్శి చదల యాకాంతం, డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్ పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకన్న

కురవి, మార్చి 19: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సీపీఐ మండల సీనియర్ నాయకుడు బుడమ వెంకన్న ఎన్నికయ్యారు. బయ్యారంలో జరిగిన జిల్లా మహాసభలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అంబేద్కర్, పూలే మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింత వెంకన్న

మరిపెడ, మార్చి 19: అంబేద్కర్, పూలే మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింత వెంకన్నకు నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞులు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లికుదురు, మార్చి 19: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడు కానం ప్రశాంత్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును తెలంగాణ శాసనసభ, శాసన మండలి ఉభయ సభల్లో ఆమోదించడాన్ని మాలలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. జాతీయ మాలమహానాడు నాయకులు రమేశ్, రాంబాబు, శ్రీకాంత్, సంజీవ, రజని, విజయ్, భీముడు, వెంకన్న, వీరన్న, సత్తయ్య పాల్గొన్నారు.

డైలీవేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గార్ల, మార్చి 19: గిరిజన ఆశ్రమ పాఠశాల డైలీ వేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. వీరన్న, లక్ష్మి, నరసింహారావు, నవీన్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల కార్మికులు